క్లుప్తంగా

విద్యార్థులకు ఆర్థికసాయం

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు ఆవోపా బ్యాంక్వెస్ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు పీవీ రమణయ్య ప్రకటించారు. పారిశ్రామికవేత్త, సీల్‌వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావును సోమవారం కాచిగూడలో కార్యవర్గ సభ్యులు కృష్ణ, బాలాజీ, జగ్గయ్య, కేవీఎస్ గుప్తా, బాబురావు, టీఎల్‌వీ రావు, హరనాథ్ తదితరులు ఘనంగా సత్కరించారు. పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున సహకారం అందిస్తామన్నారు. గతేడాది కూడా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించామన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు సాయం కోసం 9441928528 నంబరును సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు శాశ్వత ఉపాధి కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వర్‌రావు

కవాడిగూడ: ఆర్థికంగా వెనుకబడిన దివ్యాంగులకు పెన్షన్‌తో పాటు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం దోమలగూడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అఖిల భారత దివ్యాంగుల హక్కుల ఫోరం అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, డాక్టర్ దిడ్డిసుధాకర్‌ను కలిసి దివ్యాంగులకు కమిషన్ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని విన్నవించారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలన్నారు. దివ్యాంగుల హక్కుల కోసం పోరాటాలు చేసే వారికి ఎల్లప్పుడు సంఘీభావం ఉంటుందన్నారు. ఆప్ నేత రాకేష్‌సింగ్ తదితరులున్నారు.


శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్‌తో ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు

కాచిగూడ: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్ కోరారు. భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ప్రతినిధులు సోమవారం కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్‌ను అభినందించి సత్కరించారు. శ్రీనివాస్ గుప్తా, మనోజ్ మొగల్‌గిద్ది, అభినయ్ తివారి, ప్రవీణ్‌యాదవ్, వినీత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అరుంధతినగర్‌లో చేరిన వరదనీరు



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో వర్షం కారణంగా భారీగా వరద నీరు చేరింది. సోమవారం హుస్సేన్‌సాగర్ నాలా వరదనీరు ప్రహరీ కింద ఏర్పాటు చేసిన రంధ్రం నుంచి బస్తీలోకి వచ్చి చేరింది. వరద నీరు నాలాలోకి వెళ్లకుండా మట్టికుప్పలు అడ్డుగా ఉండటంతో బస్తీలో వరద మోకాల్లోతులో నిలిచింది. నాలా ప్రహరీ నిర్మాణంలో ఉండటంతో గుట్టలుగా పోసిన మట్టితో వరద నాలాలోకి వెళ్లడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వర్షం బాగా పడితే బస్తీలోని ఇళ్లలోకి వరద నీరు మరింతగా వచ్చి జలమయమయ్యే ప్రమాదం ఉందని బస్తీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'అల్లర్లకు కేంద్రమే బాధ్యత వహించాలి'

లిబర్టీ: మణిపూర్ అల్లర్లకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. మణిపూర్ రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం మణిపూర్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నేతలు దేవునూరి శ్రీనివాస్, బి.సతీష్‌కుమార్, ఇటికాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



పటేల్‌నగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్.



బీఆర్ఎస్ నేత సోమసుందరం ఆధ్వర్యంలో టమాటాల పంపిణీ, పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

అంబర్‌పేట: మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. సోమవారం అంబర్‌పేట నియోజకవర్గ వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు వేడుకలను ఘనంగా చేపట్టారు. అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ చౌరస్తాలో నిర్వహించిన కేటీఆర్ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్‌చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు, దివ్యాంగులకు మిఠాయిలు పంచిపెట్టారు.

- గోల్నాకలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ పారిశుద్ధ్య కార్మికులు, పార్టీ శ్రేణుల జన్మదిన వేడుకలను నిర్వహించారు. 6వ నంబర్ చౌరస్తాలో బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను చేశారు.
- మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో మహిళా సంఘానికి కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు హాట్‌బాక్సులను అందజేశారు.

కాచిగూడ: ట్విట్టర్ వేదికగా ఉపాధ్యాయుల పిల్లలు కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 13 జిల్లాల్లో నిలిచిపోయిన స్పౌజ్ బదిలీలు జరపాలని వారు అభ్యర్థించారు.

చిక్కడపల్లి: గాంధీనగర్‌లో పార్టీ సీనియర్ నాయకుడు ముఠా నరేష్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠాజైసింహాలు హాజరై కేక్‌కట్ చేసి అనంతరం పండ్లు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ, మాచర్ల పద్మ, శ్రీనివాస్, సత్యనారాయణ, రాజ్‌కుమార్, ప్రేమ్, శ్రీకాంత్, వెంకటేశ్, జహంగీర్, దేవయ్య, సుధాకర్, నవీన్ యాదవ్, కుమారస్వామి, నర్సింగ్, హనుమంతు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అమరం వినోద్ అన్నారు. వినోద్ ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ వద్ద పేదలకు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్మెట్ట మల్లేష్, కెప్టెన్ శ్రీను, అనిల్, మహ్మద్, హరినాథ్, జేమ్స్, చిన్నా, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ బద్దుల ఓంప్రకాష్‌యాదవ్, డాక్టర్ శిరీషయాదవ్, దిడ్డి రాంబాబు, ఎర్ర భీష్మదేవ్, కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, సునిల్‌బిడ్లాన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలు ఎక్కాల కన్నా, అశోక్‌రెడ్డి, శివరాజ్, కొండయ్య, శేఖర్, గోపాల్‌యాదవ్, అంజమ్మ, సునీత, లక్ష్మీప్రియా తదితరులున్నారు.

ముషీరాబాద్ జోన్ బృందం:

- అడిక్‌మెట్ డివిజన్‌లోని లలితానగర్ కమ్యూనిటీ హాల్‌లో కొండపల్లి మాధవ్, ప్రసన్న, శ్యామ్‌సుందర్ తదితరుల ఆధ్వర్యంలో మహిళలకు 15 కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు.
- పార్శిగుట్ట చౌరస్తాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమ సుందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేతుల మీదుగా రెండు క్వింటాళ్ల టమాటాలను ఉచితంగా పంపిణీ చేశారు.
- రాంనగర్ చౌరస్తాలో డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు.
- ముషీరాబాద్ చౌరస్తాలో శివముదిరాజ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు పలువురికి రెయిన్ కోర్టులను అందజేశారు.
- ముఠా జైసింహ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించి ఉచిత పరీక్షలు, మందులను పంపిణీ చేశారు.
- ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో చేపలను కట్ చేయడానికి వీలుగా ఉండే గొడుగులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.
- దాయరా మార్కెట్‌లో సుదేష్ ఆధ్వర్యంలో ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.
- రాంనగర్ మీసేవ కేంద్రం వద్ద సయ్యద్ అస్లాం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం, బర్త్‌డే కేక్‌కట్టింగ్‌కు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు హాజరయ్యారు.

ఉచితంగా టమాటాల పంపిణీ !

- కేటీఆర్ జన్మదినం సందర్భంగా పార్శిగుట్టలో వినూత్న కార్యక్రమం



ముషీరాబాద్: మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా ముషీరాబాద్ డివిజన్‌లోని పార్శిగుట్ట చౌరస్తాలో సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు టి.సోమసుందర్ ఆధ్వర్యంలో టమాటాలను పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న ప్రజలు ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమైతే.. గంట ముందుగానే సభాస్థలికి చేరుకున్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై టమాటాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.150 కేజీ ఉన్న టమాటాలు ఉచితంగా పంపిణీ చేయడంతో మహిళలు ఒక్కసారిగా ముందుకు దూసుకురావడంతో తోపులాట జరిగింది. నిర్వాహకులు కూడా ప్రజలను అదుపు చేయలేక చేతులెత్తేశారు. పరిస్థితి చేయిదాటడంతో బలవంతంగా మిగిలిన టమాటాల ట్రేలను పక్కనే ఉన్న ఓ షాపులో పెట్టి షటర్లు వేసి కాపలా కాశారు. పరిస్థితి కొద్దిగా సద్దుమణిగిన తర్వాత ప్రజలను లైన్‌లో ఉంచి టమాటాలను పంపిణీ చేశారు. రెండు క్వింటాళ్ల టమాటాలు క్షణాల్లో అయిపోవడంతో అందని మహిళలు నిరాశతో వెనుతిరిగారు. ముఠా జైసింహ, శివముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, అరుణ్, శోభా, ఎన్ఆర్‌ఐ సునీల్, సదా, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరించే పార్టీలకు గుణపాఠం తప్పదు

కాచిగూడ: రాష్ట్ర జనాభాలో 54 శాతం ఉన్న బీసీలను విస్మరించే పార్టీలకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ హెచ్చరించారు. సోమవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు బీసీబంధు పథకాన్ని వెంటనే అమలు చేసి బీసీల్లో ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఆర్థికసాయం అందజేయాలని కోరారు. బీసీ కులవృత్తులకు ప్రకటించిన సాయంలో కేవలం బీసీల్లోని 14 కులాలకే పరిమితం చేయడం సరికాదన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటుబ్యాంకుగానే వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేతలు ప్రశాంత్, భూషణ్ , భాస్కర్, ప్రదీప్‌గౌడ్, లక్ష్మయ్య, అలీం తదితరులు పాల్గొన్నారు.

1వ తేదీన పెన్షన్ చెల్లించాలి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతి నెల 1న పెన్షన్ చెల్లించాలని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎం.హన్మంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నారాయణలు డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, పెన్షనర్లకు రావాల్సిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ ఫెడరేషన్ కోశాధికారి విశ్వనాథం, సలహాదారులు ఈ.బాలయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ నరహరిరావు, వైస్ ప్రెసిడెంట్ గాల్‌రెడ్డి తదితరులున్నారు.

సినారె లలిత గీతాలు, సుగంధ పరిమళాలు



వడ్డేపల్లి కృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: భాషలో భావనలో సినారె రచించిన లలిత గీతాలు సుకుమారంగా సుగంధ పరిమళాలు వెదజల్లుతాయని బైసదేవదాసు అన్నారు. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలోని లలిత కళావేదికపై ప్రముఖ మహిళా సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో ప్రముఖ కవి సినారె 93వ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. లలితగీత కవి డాక్టర్ వడ్డేపల్లి కృష్ణను సినారె స్మారక పురస్కారంతో సత్కరించారు. బైసదేవదాసు మాట్లాడుతూ.. వడ్డేపల్లి కృష్ణ తెలంగాణ మట్టి నుంచి కవిగా ఎదిగారని తెలిపారు. ఆయన గీతాల్లో సినారె శైలి దేవులపల్లి కృష్ణశాస్త్రి ముద్ర కనిపిస్తాయని వివరించారు. కవి చిక్కారామదాసు, ఎం.వీ. రమణకుమారి, కనక, లలిత, శాంతి, శైలజ, మోహనకృష్ణ, వేణుగోపాలాచారి, చంద్రశేఖర్, ప్రభుకుమార్‌లతో కలిసి మధురంగా సినారె సినీగీతాలను పాడి సభికులను అలరించారు. ప్రధాన కార్యదర్శి ఎం.వీ.సుబ్బలక్ష్మి వందన సమర్పణ చేశారు.

మెస్ చార్జీల పెంపుపై హర్షం

ముషీరాబాద్: సాంఘిక సంక్షేమ హాస్టళ్లల్లో నివసించే విద్యార్థుల మెస్ చార్జీలను పెంచడంపై బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య మంత్రులకు వినతి పత్రాలు, ధర్నాలు, ఆందోళనల ఫలితంగానే ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచిందన్నారు. సీఎం కేసీఆర్, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కేవలం పదిశాతం మెస్ చార్జీలు పెంచారని ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 26 శాతం మెస్‌చార్జీలు పెంచడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భూపేష్‌సాగర్, హేమంత్, నివాస్ ఉన్నారు.

సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి



మాట్లాడున్న సొసైటీ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి

- మణిపూర్ ఘటనపై సొసైటీ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వర్‌రావు వెల్లడి

కవాడిగూడ: మణిపూర్‌లో గత మూడు నెలలుగా జరుగుతున్న హింసాత్మక, మహిళలపై అఘాయిత్యాల ఘటనలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని ఆలిండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షులు ఆర్.నాగేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌బాబులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న నిరసనలపై లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో సొసైటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణిపూర్ ఘటన భారత దేశప్రజలు తలదించుకునేలా సభ్య సమాజం సిగ్గుపడేలా ఉందన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొనేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలిండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ ప్రొటెక్షన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎస్.నరసింహరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రారం శంకర్, కోశాధికారి డి.శంకర్, సొసైటీ జాతీయ అధ్యక్షురాలు వీణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రకళ, ప్రధాన కార్యదర్శి రేణుక, కవిత, విజయ్‌బాబు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య విజ్ఞానకేంద్రం: మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడంతో పాటు గిరిజన మహిళలపై అత్యాచారం చేసి వారిని చంపిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక బీజేపీ పాలిత రాష్ట్రాల్లో హింస చెలరేగుతోందని ఆరోపించారు. దళితులు, గిరిజనులు, ముస్లింలు, క్రిస్టియన్లపైన దాడులు పెరిగాయని విమర్శించారు. ప్రొఫెసర్ ఎల్.రామ్‌లకన్, పియాంగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హోయినిలింగ్ షిత్లో, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై ఉదాసీనంగా వ్యవహరించొద్దు



డీసీపీ కార్యాలయం వద్ద బీజేపీ నేత గౌతమ్‌రావు, తదితరులు

అంబర్‌పేట: దుకాణం యజమానిపై దాడిచేసిన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం అంబర్‌పేటలోని ఈస్ట్‌జోన్ కార్యాలయంలో డీసీపీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ నెల 22న గోల్నాకలో డిజిటల్ ప్రింటింగ్ దుకాణంలో పనిచేసే ఓ వర్గం యువకుడిని పనిలో నుంచి తొలగించడంతో అతడు మరికొంత మందితో కలిసి దుకాణంపై దాడిచేసిన విషయం తెలిసిందే. దుకాణ యజమానితో పాటు అందులో పనిచేసే సిబ్బందిపై సైతం దాడిచేసి గాయపరిచాడు. దీనిపై పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించవద్దని బీజేపీ నేతలు డీసీపీని కోరారు. బీజేపీ నేతలు గౌతమ్‌రావు, బి.వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ అమృత పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు.

డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేసే కుట్ర

లాలాపేట: జనాభాల్లో 52 శాతం ఉన్న బీసీలకు సీఎం పదవితో పాటు 63 ఎమ్మెల్యే సీట్లు తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని సదరన్ పొలిటికల్ అకాడమీ అధ్యక్షులు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కేవలం 34 ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తామనడం వారిని అవమాన పరచడమే అని, బీసీ డిక్లరేషన్ల పేరుతో కుట్ర చేస్తూ అన్ని పార్టీలు మరోసారి బీసీలను మోసం చేయడానికి సిద్ధపడుతున్నాయని ఆరోపించారు.

హాస్టళ్ల సమస్యలను పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పరిశోధన విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం పరిశోధన విద్యార్థి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో హాస్టళ్లను సందర్శించారు. వర్షాల కారణంగా భవనాలు కురుస్తున్నాయని, పైకప్పులు పెచ్చులూడి పడుతున్నాయన్నారు. విద్యార్థుల నుంచి అధికంగా మెస్ బిల్లులు వసూలు చేస్తున్న హాస్టళ్ల నిర్వహణలో అధికారులు విఫలమయ్యారన్నారు. వీసీ క్యాంపస్‌లోని హాస్టళ్లు, భోజనశాలలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జలమండలి జీఎంకు వినతి



ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ దయార మార్కెట్‌లోని బంధన్ ఫంక్షన్‌హాల్ నుంచి టెంట్‌హౌజ్ హోటల్ వరకు సివరేజ్ పైపులైన్ పనులను వెంటనే చేపట్టాలని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి కోరారు. గత మూడు నెలలుగా ఈ రోడ్డు మొత్తం పైపులైన్ కోసం తవ్వి గుంతలమయంగా మారిందన్నారు. ఈ పనులు పూర్తి చేస్తేనే కొత్త రోడ్డు వేసేందుకు అనుకూలంగా ఉంటుందని కొత్త రోడ్డు నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయని జలమండలి జీఎం రామకృష్ణకు ఇచ్చిన మెమోరాండంలో తెలియజేశారు. బస్తీ వాసులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



నిరసన దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ఈ నెల 29న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ఉద్యోగ, ఉపాధ్యాయ నిరసన దీక్ష పోస్టర్‌ను ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆవిష్కరించారు. అనంతరం సోమవారం ఆయన మాట్లాడుతూ.. జీవో 317 ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒక సునామీ లాంటిదని ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి జంగయ్య, టీఆర్‌టీఎఫ్ అధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు, మల్లేష్, విద్యాసాగర్, ఝాన్సీరాణి, వినోద తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణపై మాల ప్రజా సంఘాల ఆందోళన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపడుతున్న చెన్నయ్య

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మాల ప్రజాసంఘాల చైర్మన్ చెన్నయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పదేళ్లుగా పరిపాలిస్తున్న కేంద్రం ఎస్సీ వర్గీకరణపై మాట్లాడలేదని ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మాల, మాదిగల మధ్య చిచ్చుపెడుతోందని ఆరోపించారు. ఒక వర్గం ఓట్లను దండుకోవడం కోసమే బీజేపీ కుల రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కిషన్ రెడ్డి ఎక్కడ పోటీ చేసిన మాలలు ఆయనను ఓడించేందుకు పోరాడతామని హెచ్చరించారు. ఆందోళనకు అనుమతి లేకపోవడంతో పోలీసులు ఆందోళన కారులను వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. జేఏసీ వర్కింగ్ చైర్మన్ వెంకటేశ్వర్లు, రమేష్, ప్రకాష్, సత్యనారాయణ, శ్రీనివాస్, నాగరాజు, ఆనంద్, కృష్ణమూర్తి, వెంకటేష్, శంకర్, కల్యాణ్, ప్రసాద్, సుభద్ర, సంగీత తదితరులున్నారు.

కంటోన్మెంట్‌ల విలీనంపై ముందుకే..

- పార్లమెంట్‌లో రక్షణ శాఖ సహాయ మంత్రి ప్రకటన
- రాష్ట్రాలతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడి

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌ల భవితవ్యంపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరవేస్తూ ఎట్టకేలకు కేంద్రం స్పష్టమైన ప్రకటన చేసింది. దేశ వ్యాప్తంగా 58 కంటోన్మెంట్‌లలోని సివిలిన్ ప్రాంతాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయనున్నట్లు రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ స్పష్టం చేశారు. వివిధ రాష్ట్రాలోని మున్సిపాలిటీలు, కంటోన్మెంట్‌ల పాలనలోని సివిలియన్ ప్రాంతాల్లో ఒకే తరహా పాలన ఉండాలన్న లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయా రాష్ట్రాలతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, ఈ నేపథ్యంలో కచ్చితమైన కాలపరిమితి వెల్లడించలేమన్నారు.

కంటోన్మెంట్‌లలోని సివిలియన్ ప్రాంతాలను వేరు చేయాల్సిందిగా పలువురు ప్రజా ప్రతినిధులతో పాటు ప్రజల నుంచి కూడా పెద్ద ఎత్తున వినతులు వచ్చాయని ఇప్పటి వరకు కంటోన్మెంట్‌లోని సివిలియన్ ప్రాంతాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అమలుకు ఎలాంటి అడ్డంకులేవన్నారు. కంటోన్మెంట్‌లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేశాక, అంతకు ముందు బోర్డు ఆధీనంలోని ఆస్తులు, నిధులు అన్నీ సంబంధిత మున్సిపల్ ఆధీనంలోకి వెళ్తాయన్నారు.

పైలట్‌గా ఎంపిక చేసి..

12 ఏళ్ల క్రితం నాటి క్యాస్ యోల్ అంశంతో సంబంధం లేకుండా మిగతా కంటోన్మెంట్‌లను సైతం సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా దేశంలోనే అతిపెద్ద సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోనే ఈ ప్రక్రియ ప్రారంభించారు. తద్వారా ఇక్కడ తలెత్తే సమస్యల పరిష్కారం మిగతా కంటోన్మెంట్‌లకు ఉదాహరణగా పనికొస్తుందని భావించారు. ఈ మేరకు 2023 జనవరి 4న కేంద్రం ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించింది. ఫిబ్రవరి మొదటి వారంలో కమిటీ నివేదిక ఇచ్చాక దీనిపై ఎలాంటి కదలిక లేదు. దీంతో స్థానికంగా తీవ్ర సందిగ్ధత నెలకొంది. అడపాదడపా రక్షణ శాఖ చర్యలతో విలీనంపై ఊహాగానాలు మినహా అధికారిక సమాచారం మాత్రం వెల్లడి కాలేదు. తాజాగా రక్షణ శాఖ సహాయ మంత్రి ప్రకటనతో కేంద్రం విలీనానికి సిద్ధంగా ఉందని తెలుస్తున్నప్పటికీ, ఎప్పటి వరకు ఈ ప్రక్రియ పూర్తవుతుందో మాత్రం స్పష్టత రాలేదు.